# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 342

పేజీలు : 08 | వెల: రూ.5/-

శుక్రవారం

అక్టోబర్ 31, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## నిద్ర మత్తులో ప్రభుత్వం



8లో..

- కంటతడి పెడుతున్న అన్నదాతలు
- తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్
- తుఫాను నష్టంపై ఈటల రాజేందర్ విమర్శలు






వివరాలు2లో..

# ముంపునకు.. శాశ్వత పరిష్కారం





- నాలా ఆక్రమణలు తొలగిస్తాం
- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తాం
- సర్వం కోల్పోయిన వారికి అండగా ఉంటాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ
- మంత్రులతో కలిసి ముంపు ప్రాంతాల్లో పర్యటన
- కలెక్టరేట్ లో అధికారులతో రివ్యూ

గ్రేటర్ వరంగల్ పరిధిలోని ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మొంథా తుఫాను ప్రభావంతో వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో తీవ్ర నష్టం ఏర్పడిన నేపథ్యంలో సీఎం శుక్రవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం నగరంలోని ముంపు ప్రాంతాలైన సమ్మయ్యనగర్, నయీమ్ నగర్, పోతన నగర్, రంగంపేట ప్రాంతాల్లో ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యలతో కలిసి పర్యటించారు. వర్షం తీవ్రతతో సర్వం కోల్పోయిన పలువురిని పరామర్శించారు. కన్నీటి పర్యంతమైన మహిళలను ఓదార్చారు. వారినుంచి వినతులు స్వీకరించారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ను తిలకించారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రివ్యూ సమావేశంలో సీఎం పాల్గొన్నారు. ముంపు ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అంతకుముందు ఆర్ట్స్ కళాశాలకు చేరుకున్న ముఖ్యమంత్రికి రాష్ట్ర ఫైనాన్స్ కమిషనర్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, సీపీ సన్ ప్రీత్ సింగ్, గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తదితరులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. – వరంగల్ వాయిస్ ప్రతినిధి

## రూ.10 కోట్ల నష్టం

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి
- రెండు రోజులు క్షేత్రస్థాయి పర్యటన



8లో..




## మేయర్ పై తిరుగుబాటు

- సమ్మయ్య నగర్ లో తిరగబడ్డ జనం
- ఫొటోలకోసం తప్ప సమస్యలు తీర్చారా అంటూ నిలదీత

గ్రేటర్ వరంగల్ పరిధిలోని హనుమకొండ జిల్లా సమ్మయ్య నగర్ లో నగర మేయర్ గుండు సుధారాణిపై స్థానికులు తిరగబడ్డారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ముందస్తుగా గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి సమ్మయ్య నగర్ లో మేయర్ పర్యటించారు. సమ్మయ్య నగర్ చేరుకున్న నగర మేయర్ పై స్థానికులు తిరగబడ్డారు. ఫొటోల కోసం తప్ప, మా సమస్యలు ఏనాడైనా తీర్చారా అంటూ మండిపడ్డారు. గత 15 సంవత్సరాలుగా ప్రతి ఏడు వర్షాలు కురవడం, వరద ప్రభావంతో కాలనీలు నీట మునగడం పరిపాటిగా మారిందన్నారు. ముంపుకు గురైన ప్రతి సారీ కోట్ల రూపాయలు విడుదల చేస్తున్నామంటూ ప్రభుత్వం చెప్పడం తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కోట్లు ఎక్కడ పోతున్నాయంటూ నిలదీశారు. ముంపు నివారణకు పర్మినెంట్ సొల్యూషన్ దొరకడంలేదా అంటూ ఆగ్రహించారు. దీంతో వారికి సమాధానం చెప్పకుండానే మేయర్ అక్కడినుంచి తిరిగి వెళ్లిపోయారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, అక్టోబర్ 31, 2025

# ముంపునకు.. శాశ్వత పరిష్కారం




- నాలా ఆక్రమణలు తొలగిస్తాం
- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తాం
- సర్వం కోల్పోయిన వారికి అండగా ఉంటాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ
- మంత్రులతో కలిసి ముంపు ప్రాంతాల్లో పర్యటన
- కలెక్టరేట్ లో అధికారులతో రివ్యూ

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని 12 జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. అయితే ముంపునుంచి రక్షణకు తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందించాలని ఆయన సూచించారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారీ వర్షాలతో జరిగిన పంట, ఆస్తి, ప్రాణ నష్టాలపై శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ లతో కలసి రాష్ట్ర స్థాయి అధికారులు, 12 జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు.

### అంచనా వేయండి..

సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు. ప్రాణ నష్టం, పంట నష్టం, పశు సంపద, అన్ని శాఖలకు సంబంధించి ఇన్ఫ్రాస్ట్రక్చర్ నష్టానికి సంబంధించి నివేదికలు తెప్పించుకోవాలన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించి రిపోర్టులను కలెక్టర్లకు అందజేయాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

### ఉపేక్షించేది లేదు..

పది మంది ఆక్రమణ దారులకోసం పదివేల మందికి నష్టం జరుగుతుంటే ఉపేక్షించవద్దని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నాలాల కబ్జాలను తొలగించాల్సిందే అన్నారు. ఆక్రమణదారుల వెనుక ఎంతటివారున్నా ఉపేక్షించేది లేదన్నారు. దీనిపై అధికారులు స్పష్టమైన నిర్ణయంతో ముందుకు వెళ్లాలన్నారు. వరదలు తగ్గిన నేపథ్యంలో శానిటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

### రూ.5 లక్షల పరిహారం..

వరదల్లో ప్రాణ నష్టం జరిగిన ప్రాంతాల్లో పరిహారం అందించాలన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందుకు సంబధించి వివరాలు సేకరించాలంటూ కలెక్టర్లకు సూచించారు. పంటనష్టం, పశు సంపద నష్టపోయిన చోట వారికి పరిహారం అందించాలన్నారు. ఇసుక మేటలు పేరుకున్న రైతులను ఆదుకునేందుకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. ఇండ్లు మునిగిన వారికి ప్రతీ ఇంటికి రూ.15 వేలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అయితే ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులైన వారిని గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు.

### ఫీల్డ్ విజిట్స్ తప్పనిసరి..

మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీలో చేయాల్సిన పనులపై ప్రత్యేక నివేదిక తయారు చేయాలన్నారు. ఎక్కడా పనులు ఆపే ప్రసక్తి ఉండొద్దన్నారు. క్షేత్రస్థాయిలో ఒక కో–ఆర్డినేషన్ కమిటీ వేసుకుని పనిచేయాలన్నారు. వాతావరణ మార్పులతో క్లౌడ్ బరస్ట్ అనేది నిత్యకృత్యమైనందున శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సీఎం సూచించారు. అధికారులు నిర్లక్ష్యం వీడి క్షేత్రస్థాయికి వెళ్లాలంటూ సూచించారు. కలెక్టర్లు ఫీల్డ్ విజిట్స్ చేయాల్సిందే అన్నారు. అదే విధంగా కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవడంలో అలసత్వం వద్దన్నారు. సమన్వయ లోపంతో సమస్యలు పెరుగుతున్నాయంటూ చురకలు అంటించారు.



















### ఘన స్వాగతం..

హెలీక్యాప్టర్ లో ఆర్ట్స్ కళాశాల చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ, డిప్యూటీ స్పీకర్, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. సీఎంతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిలకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ఫైనాన్స్ కమిషనర్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితరులు ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్ ద్వారా వరంగల్, హన్మకొండ జిల్లాల్లోని పలు ప్రాంతాలను సీఎం ఏరియల్ సర్వే చేశారు. ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి ప్రత్యేక వాహనంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, ఎంపీ ఎమ్మెల్యేలు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు.

# వైభవంగా పోచమ్మ గుడి ప్రారంభోత్సవం

◆ కొమురయ్య జ్ఞాపకార్థం దేవాలయ నిర్మాణం
◆ తండ్రి బాటలో తనయుడు విజయ్





**వరంగల్ వాయిస్, కమలాపూర్:** మండలం పరిధిలోని మద్రిపల్లి గూడెం జోజూనూరుపల్లి గ్రామంలో శుక్రవారం నాడు అట్టహాసంగా గ్రామ మాజీ సర్పంచి దివంగత ఇనుగాల (ముచ్చర్ల) కొమురయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నిర్మించిన పోచమ్మ తల్లి నూతన ఆలయం వైభవంగా ప్రారంభోత్సవం జరిగింది. కీర్తిశేషులు కొమురయ్య జ్ఞాపకాలను సజీవంగా ఉంచేందుకు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించేందుకు వారి కుటుంబ సభ్యులు ఈ ఆలయాన్ని వారి సొంత ఖర్చులతో నిర్మించారు. కొమురయ్య కొడుకు-కోడలు మాజీ సర్పంచ్ ఇనుగాల కిరణ్మయి విజయ్, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ ఆలయం నిర్మించారు. ఆలయ ప్రారంభోత్సవ వేడుకలకు భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై, పోచమ్మ తల్లి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా తమ






తండ్రి ఆశయాలకు అనుగుణంగా ఈ దేవాలయాన్ని నిర్మించినందుకు ఇనుగాల కొమురయ్య కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. పోచమ్మ తల్లి అనుగ్రహం మనందరిపై, మన కుటుంబాలపై, ఈ గ్రామంపైనా ఎల్లప్పుడూ ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థిస్తున్నామని కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో పేర్కొన్నారు.

### వారసత్వాన్ని కొనసాగిస్తున్న తనయుడు..

కొమురయ్య కుమారుడు, మాజీ సర్పంచ్ కిరణ్మయి భర్త విజయ్ సేవలను గ్రామ ప్రజలు ప్రత్యేకంగా ప్రస్తావించారు. తండ్రి సామాజిక, రాజకీయ వారసత్వాన్ని విజయ్ గొప్పగా ముందుకు తీసుకువెళుతున్నారని కొనియాడారు. మాజీ సర్పంచ్ గా తన భార్య కిరణ్మయి కొనసాగిన కాలంలో విజయ్ గ్రామాభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారు. అలాగే, గ్రామ ప్రజల అభివృద్ధి, సంక్షేమమే తన ధ్యేయంగా నిత్యం శ్రమిస్తూ, తండ్రి ఆశయాలను సజీవంగా ఉంచుతున్నారని గ్రామ పెద్దలు ప్రశంసించారు. ఈ పోచమ్మ ఆలయ నిర్మాణం జోజూనూరుపల్లి గ్రామ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, ఇది ప్రజలకు ఆధ్యాత్మిక కేంద్రంగా, ఐకమత్యానికి నిదర్శనంగా ఉంటుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఇనుగాల కరుణ, ఇనుగాల జ్యోష్ణాదేవి (ఏసీపీ), ఇనుగాల అభివవ్ కార్తీక్, ఇనుగాల వైష్ణవి ప్రియ, ఇనుగాల హరిప్రియ, బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముంపు కాలనీలను పరిశీలించిన ఎమ్మెల్యే

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్‌లో గోపాలపురం చెరువు కోతకు గురికావడం వల్ల వివేక్ నగర్, అమరావతి నగర్ తదితర కాలనీలు నీట మునిగిన నేపథ్యంలో శుక్రవారం ఉదయం వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు రంగంలోకి దిగారు. ఆయన అధికారుల బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరిగి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. నీట మునిగిన ఇళ్లలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను ఎమ్మెల్యే నాగరాజు స్వయంగా గమనించారు. ఇళ్లలోని వస్తువులు పూర్తిగా నాశనం కావడంతో పాటు, సుమారు రెండు అడుగుల మేర బురద పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృశ్యాలను చూసి ఆయన చలించిపోయారు. బాధితుల కష్టాలు చూసిన ఎమ్మెల్యే నాగరాజు వెంటనే సంబంధిత అధికారులకు కింది విధంగా ఆదేశాలు జారీ చేశారు.చెరువులోని నీటిని తక్షణం బయటకు పంపించే చర్యలు వేగంగా చేపట్టాలి. కాలనీలలో పేరుకుపోయిన బురద తొలగింపు, చెత్త తొలగింపు, మరియు దుర్వాసన నివారణ చర్యలు వెంటనే చేపట్టాలి.



ప్రభావిత కుటుంబాలకు అవసరమైన ఆహారం, తాగునీరు, ఔషధాలు మరియు తాత్కాలిక నివాస సదుపాయాలు అందించాలి. తదుపరి, బాధితులను పరామర్శిస్తూ ఎమ్మెల్యే నాగరాజు వారికి ధైర్యం చెప్పారు. "ప్రజలు ఎవరూ ఆందోళన చెందకూడదు. ప్రభుత్వం మీతో ఉంది. ప్రతి బాధిత కుటుంబానికి తగిన సహాయం అందేలా తక్షణమే చర్యలు తీసుకుంటాం" అని ఆయన గట్టి భరోసా ఇచ్చారు. ఈ సందర్భనలో మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, కార్పొరేటర్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షానికి దెబ్బతిన్న విద్యుత్ సరఫరా

**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో మొన్న కురిసిన భారీ వర్షాలు, పిడుగుపాటు కారణంగా తలెత్తిన విద్యుత్ సమస్యలను విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన స్పందించి పరిష్కరించారు.హసన్‌పర్తి మండలంలోని నాగారం గ్రామంలో భారీ వర్షానికి, పిడుగుపాటుకు గురైై ప్రభుత్వ పాఠశాల సమీపంలోని ఎస్ఎస్-3, 100 కేవీ డీటీఆర్ (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్) లో ఒక కాయిల్ తెగిపోయి పూర్తిగా పనిచేయకుండా పోయింది. ఈ సమస్యను గుర్తించిన వెంటనే, ఉన్నతాధికారులు వేగంగా స్పందించారు. డీఈ సౌమ్య నాయక్, ఏడీ అశోక్, ఏఈ తరుణ్ కుమార్, సబ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవ తీసుకుని, సిబ్బందిని అప్రమత్తం చేశారు. లైన్‌మెన్‌లు సురేష్, ఉమేష్ కుమార్, అన్‌మ్యాన్డ్ సిబ్బంది రావుల కుమార్, బొక్క కుమార్ ల సహాయంతో ఎస్పీఎం నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను హుటాహుటిన తీసుకొచ్చి, వెంటనే కొత్త డీటీఆర్‌ను ఏర్పాటు చేశారు. దీనితో గ్రామంలో విద్యుత్ సమస్య పూర్తిగా తొలగిపోయింది. ప్రజలు అధికారుల పనితీరు పట్ల ఆనందం వ్యక్తం చేశారు.అదేవిధంగా, రెడ్డిపురం, గుండ్ల సింగారం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గుండ్ల సింగారంలోని



సబ్‌స్టేషన్ పూర్తిగా నీటిలో మునిగిపోవడం దీనికి ప్రధాన కారణం. పరిస్థితిని అంచనా వేసిన డీఈ, ఏడీ, ఏఈ అధికారులు తక్షణమే స్పందించి, లైన్‌మెన్, ఏఎల్‌ఎం సిబ్బంది అయిన శోభన్, కుమార్ తో కలిసి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. నాగారం సబ్‌స్టేషన్ నుంచి ముచ్చర్ల ఫీడర్ ద్వారా బ్యాక్ ఫీడింగ్ తీసుకొని, రెడ్డిపురం గ్రామానికి వెంటనే కరెంటు ఇవ్వడం జరిగింది. ఇంత తొందరగా, సమయస్ఫూర్తితో స్పందించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించిన విద్యుత్ సిబ్బందిని గ్రామస్థులు మనస్ఫూర్తిగా అభినందించారు

# కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా



**వరంగల్ వాయిస్, దామెర :** కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు అన్నారు.దామెర మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తుత్తురు సత్యం తల్లి లచ్చమ్మ ఇటీవలే మృతిచెందగా నేడు వారి కుటుంబాన్ని చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు.ఈ సందర్భంగా లచ్చమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే వెంట దామెర మండల అధ్యక్షుడు గండు రామకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ జాకీర్ అలీ,మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మండల యూత్ అధ్యక్షులు పెంచాల రాజేందర్, సీతారాంపురం బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు మైల చిన్నా రాజు, కార్యదర్శి పెండ్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ లు తుత్తూరు శ్రీనివాస్, తుత్తురు ఈశ్వర్, నాయకులు పుల్యాల రఘుపతి రెడ్డి, కేతుపల్లి శ్రీధర్ రెడ్డి, జక్కుల స్వామి, తుత్తురు రాజు,పెండ్లి రాజు, విజయ్, పిండి రవి, మైల సదయ్య, పిండి సాంబయ్య, మండల యూత్ నాయకులు, సైయిలని తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక దీపోత్సవానికి నూనె క్యాన్ల వితరణ



**వరంగల్ వాయిస్, గణపురం:** ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో నవంబర్ 5న నిర్వహించే కార్తీక దీపోత్సవానికి గణపురం మండల కేంద్రానికి చెందిన గాజర్ల రఘుపతి గౌడ్, రమ దంపతుల కుమారుడు గాజర్ల చింటూ గౌడ్ శుక్రవారం నూనె క్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయానికి నూనె క్యాన్లను అందజేసిన గాజర్ల చింటూ గౌడ్ కు కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో దూల కుమారస్వామి గౌడ్, నారగాని రాములు గౌడ్ పాల్గొన్నారు.

# రక్తదానం ఒక గొప్ప సేవ

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ:** ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయాలని, అలా చేయడం వల్ల దాతలకు కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. పోలీసుఅమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జనగాం లోని నెహ్రు పార్క్ సమీపంలో గల కామక్షి ఫంక్షన్ హల్ లో పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ రక్తదానంతో అత్యవసర పరిస్థితుల్లో రోగి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. సమాజంలో రక్తదానం అత్యంత మహత్తర సేవ అని, ప్రతి ఒక్కరూ ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల సేవలను చిరస్మరణీయంగా నిలుపుకోవాలన్నారు. కార్యక్రమ అనంతరం రక్త దానం చేసిన వారికి సర్టిఫికెట్, పండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజా మహేంద్ర నాయక్, ఏసీపీ పండరి చేతన్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరా గాంధీ, సర్దార్ పటేల్ లకు ఘన నివాళి

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** భారతదేశ మాజీ ప్రధాని, ఇందిరా గాంధీ వర్ధంతిని, అలాగే భారత దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని, శుక్రవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణలు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. కాంగ్రెస్ శ్రేణులు వారి సేవలను గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరా గాంధీ సేవలను, త్యాగాలను స్మరించుకున్నారు. మహిళా శక్తికి మార్గదర్శిగా నిలిచిన మహోన్నత నాయకురాలు ఇందిరా గాంధీ అని కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఆమె ఎన్నో చట్టాలను తీసుకొచ్చి, వారి అభ్యున్నతికి బాటలు వేశారని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ గారి 41వ వర్ధంతి సందర్భంగా ఈ రోజు దేశవ్యాప్తంగా వారి సేవలను, ఆ కుటుంబం చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటున్నారని ఎమ్మెల్యే నాయిని అన్నారు. నాడు కాంగ్రెస్ పార్టీ ఇందిరా గాంధీ గారి ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను



నేటి తరం ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లతో పేద నిరుపేద కుటుంబాలకు గృహకల్పన కల్పించామని గుర్తుచేశారు. ఇందిరమ్మ పేరు మీద ఏ పథకం ప్రారంభించినా కూడా పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే విజయవంతంగా జరిగిందని అన్నారు. చరిత్రలో సూర్యచంద్రులు ఉన్నంతవరకు ఇందిరా గాంధీ, వారి కుటుంబం చేసిన సేవలు, అభివృద్ధి చిరస్థాయిగా నిలుస్తాయని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం



**వరంగల్ వాయిస్, పరకాల:** భారతదేశ మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి, భారత ఉక్కు మహిళ, భారతరత్న ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని, శుక్రవారం పరకాల పట్టణంలో ఘనంగా నివాళులర్పించారు. పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పట్టణ కేంద్రంలోని తమ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధి, ఐక్యత, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అర్పించిన మహానేత ఇందిరా గాంధీ అని కొనియాడారు. ఆమె చూపిన మార్గదర్శనం ఇప్పటికీ దేశ ప్రజలకు ప్రేరణగా నిలుస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. దేశ అభివృద్ధి మరియు ఐక్యత కోసం ఆమె చేసిన సేవలు అపారమైనవి. సమాజంలో సమానత్వం, మహిళా సాధికారతకు ఆమె మార్గదర్శకురాలిగా నిలిచారు. దేశ ప్రజల హక్కుల కోసం ఆమె తన చివరి శ్వాస వరకూ పోరాడిన గొప్ప నాయకురాలు అని రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇందిరా గాంధీ గారి సేవలను గుర్తు చేసుకున్నారు.

## న్యూశాయంపేటలో..



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట:** భారతదేశ తొలి మహిళ ప్రధాని భారతరత్న నిరుపేదల కోసం, దేశ సమగ్రత కోసం నిరంతరం పోరాడిన 'ఐరన్ లేడీ' నాయకురాలు ఇందిరా గాంధీ త్యాగం మరువలేనిదని ఆమె ఆశయాలే మరువలేని ఆమె స్ఫూర్తితోనే నాయకులు ప్రజలు మహిళలు యువత సేవాగుణంతో ముందుకు వెళ్లాలని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు అన్నారు. న్యూ శాంపేట సర్కిల్ లోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్ రావు, డివిజన్ అధ్యక్షుడు సురేందర్, సీనియర్ నాయకులు సత్తు రమేష్, పిండి రమేష్ , యాదగిరి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కు మహిళ ఇందిరా గాంధీ



**వరంగల్ వాయిస్, కొత్తవాడ :** భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం గ్రేటర్ వరంగల్ 23వ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా 23వ డివిజన్‌లోని 80 ఫీట్ల రోడ్డు, ఆటోనగర్ చౌరస్తా వద్ద ఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పవెంకటేశ్వర్లు నేత ముఖ్య అతిథిగా పాల్గొని, ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలను, ఆమె త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ అధ్యక్షుడు దామెర రాజ్ కమల్ ఆధ్వర్యంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక నాయకులు కొక్కుల సతీష్, ఎండీ అంజద్, బొల్లు సతీష్, మండల సురేష్, ఎస్కే హైదర్, దేవర రాము, మామిడాల నరేష్, మండల శంకర్, ఈగ శ్రీధర్, గుత్తికొండ తిరుపతి, మానగాని గోవింద్, జంపాల వేణుగోపాల్ మరియు ఇతర డివిజన్ నాయకులు ఉన్నారు. నాయకులు, కార్యకర్తలు ఇందిరా గాంధీ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని, పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

## ధీరవనిత ఇందిరా గాంధీ



**వరంగల్ వాయిస్, శాయంపేట:** భారతదేశ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి, తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం శాయంపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. దివంగత ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, ఇందిరా గాంధీని ధీరవనితగా అభివర్ణించారు. భారతదేశ తొలి మహిళా ప్రధానిగా ఆమె అనేక సంస్కరణలను అమలు చేసి, పేదల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుజ్జన్న, చిందం రవి, రఫీ, వరదరాజు, కటయ్య, రాజేందర్, సదయ్య, బాసని రవి, మార్కండేయ, చిరంజీవి, రంగు బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో..



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** భారత మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై, ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి, పేద ప్రజల అభ్యున్నతికి ఇందిరమ్మ చేసిన సేవలను వారు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బయ్య కుమారస్వామి,మండల వర్కింగ్ అధ్యక్షులు పరికీరాల వాసు, బరుపట్ల కిరీటి, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు రేవూరి జయపాల్ రెడ్డి, మాజీ ప్యాక్స్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, గ్రామ ప్రధాన కార్యదర్శి అలువాల రవి, మండల కార్యదర్శులు మంతుర్తి రవి, వడ్డేపల్లి ప్రసాద్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎర్ర శివారెడ్డి, ఓబీసీ కోఆర్డినేటర్ చిమ్మని దేవరాజు, సీనియర్ నాయకులు ఉప్పల సుదర్శన్, సంగే మహేందర్, జన్ను సాంబయ్య, మనగాని తిరుపతి, కోల రంపాల్, గంగినేని సతీష్, ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతదేశ మొట్టమొదటి హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఏవీవీ కళాశాలలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో భాగంగా, ముందుగా వలంటీర్లు, అధికారులు వెంకట్రామ జంక్షన్లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో సభ నిర్వహించి, దేశానికి పటేల్ అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ, విలువల, దేశభక్తి, మరియు జాతీయతకు కట్టుబడిన అగ్ర నాయకులలో సర్దార్ పటేల్ ముఖ్యులు అని పేర్కొన్నారు. ఆయన జన్మదినాన్ని భారత ప్రభుత్వం "జాతీయ సమైక్యత దినం" (రాష్ట్రీయ ఏకతా దివస్)గా ప్రకటించిందని తెలియజేశారు.సర్దార్ పటేల్ భారతదేశంలో సుమారు 350 సంస్థానాలను విలీనం చేసి, దేశ సమైక్యతకు కృషి చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానాన్ని సైనిక చర్య (పోలీస్ యాక్షన్) ద్వారా నిజాం రాజును లొంగదీసుకుని భారతదేశంలో విలీనం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని వక్తలు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సాకేత్, దేవిశ్రీప్రసాద్, సాత్విక్, సాయి హర్షిత్, చిరంజీవి, సంజన, ఆయేషా తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ ఆశయాలను కొనసాగిద్దాం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా గోవిందరాజుల గుట్ట కింద గిర్మాజిపేట లోని ఇందిరాగాంధీ విగ్రహానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, మీసాల ప్రకాష్, భాషాపాక సదానందం, కార్పొరేటర్ చింతాకుల అనిల్, మాజీ కార్పొరేటర్ భారతి రమేష్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్గీయ ఇందిరాగాంధీ భారతదేశం కోసం హరిజన గిరిజన బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. ఇందిరాగాంధీ ఆశయాలను కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంద శ్రీనివాస్, ఎర్రం కమల్, పొలెపాక విశాల్ బాబు, ఎర్రం మణిదీప్, పోలేపాక రమేష్, కొమ్ము అమర్, షాబాద్ యోగి, మంద కిరణ్, బొబ్బిలి అక్షయ్, పోలేపాక సన్నీ, చిన్న పల్లి విజయ్, కంచర్ల వేణు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిట్‌లో ఓపెన్ ఎయిర్ అంఫైథియేటర్

## ■ రూ.30 కోట్ల వ్యయంతో నిర్మాణాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (ఎన్ఐటీ) వరంగల్ క్యాంపస్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి దిశగా రెండు కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన జరిగింది. సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుభుధి గారు ఈ రెండు అత్యాధునిక నిర్మాణాలకు పునాది రాయిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలకు డీన్ (ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్) ప్రొఫెసర్ పి. రతీష్ కుమార్, ఇతర డీన్లు, రిజిస్ట్రార్, విభాగాధిపతులు, ఎస్టేట్ ఆఫీస్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు మరియు సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) అధికారులు హాజరయ్యారు. అత్యాధునిక ఓపెన్ ఎయిర్ అంఫైథియేటర్ సీపీడబ్ల్యూడీ ద్వారా నిర్వహణ అమలు చేస్తున్నారు. ఇది 2,500 మంది కూర్చునే సామర్థ్యంతో పాటు రెండు ఆర్ట్ గ్యాలరీలు, ఒక మల్టీ పర్పస్ హాల్‌ను కలిగి ఉంటుంది. ఈ అంఫైథియేటర్ సంస్థ సాంస్కృతిక, మౌలిక వసతుల రంగంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఇది సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యా కార్యక్రమాలు, కమ్యూనిటీ సమావేశాలకు అనువైన వేదికగా మారనుంది. విద్యార్థుల పరస్పర మేళవింపు, కళాత్మక వ్యక్తీకరణ, ప్రజా చర్చలకు ఈ కేంద్రం దోహదపడుతుంది. నూతన క్యాంటీన్ (కేఫ్టేరియా) ఇందులో 350 సీట్ల డైనింగ్ హాల్ మరియు ఆధునిక వంటగది ఏర్పాటు చేయబడుతుంది. ఈ నూతన క్యాంటీన్ విద్యార్థులు, సిబ్బంది, సందర్శకులకు సౌకర్యవంతమైన, శుభ్రమైన, సమర్థవంతమైన భోజన వాతావరణాన్ని అందిస్తుంది. నిర్మాణం పూర్తైన తర్వాత ఇది క్యాంపస్‌లో చురుకైన సామాజిక కలయికకు, కమ్యూనిటీ పరస్పర మేళవింపుకు ప్రధాన కేంద్రంగా మారుతుంది. ఈ రెండు ప్రాజెక్టుల శంకుస్థాపన ఎన్ఐటీ వరంగల్ నిరంతర మౌలిక సదుపాయాల అభివృద్ధి దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుభుధి పేర్కొన్నారు.

# ప్రభుత్వం ఆదుకోవాలి



**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతన్నల ఆరుగాలం కష్టాన్ని వరుణుడి పాలు చేశాయి. చేతికొచ్చిన పంట కళ్లముందే నాశనం కావడంతో రైతుల బ్రతుకు అగమ్యగోచరంగా తయారైంది. మండలంలో రైతులు సాగు చేసిన పంటలు అకాల వర్షాల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్నాయి. దామెర మండలం దమ్మన్నపేటకు చెందిన ఎంరెడ్డి నర్సింహ రెడ్డి, గడల రాజు, పాండవుల రాజులకు చెందిన టమాటా పంట పూర్తిగా నాశనమై నేలకూలిపోయింది. పత్తి పంట కోసం ఎరువులు, మందులు కొనేందుకు లక్షల రూపాయలు అప్పులు తెచ్చామని, అకాల వర్షాల కారణంగా పత్తి తడిసి నల్లగా మారిపోయి పూర్తిగా పనికిరాకుండా పోయిందని రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.వరి పొలాల్లో కూడా నీరు నిలిచిపోయి పంటలు పూర్తిగా పాడైపోయాయి.రైతుల కష్టానికి ఫలితం లేకుండా పోవడంతో, తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చాలామంది రైతులు తమ పంటను పూర్తిగా రుణాల మీద ఆధారపడి సాగు చేశారని, ఇప్పుడు వడ్డీలు, అప్పులు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే, అప్పుల భారం తట్టుకోలేక చాలామంది రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు ప్రభుత్వాన్ని వెంటనే స్పందించి, కింది విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నష్టపోయిన పంటలను అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలి. సర్వే ఆధారంగా నష్టపోయిన ప్రతి రైతుకు తగిన నష్ట పరిహారం వెంటనే చెల్లించాలి. ప్రభుత్వం తమను ఆదుకోకపోతే తాము బ్రతికే మార్గం లేదని అన్నదాతలు వేడుకుంటున్నారు.

# ఘనంగా రాష్ట్రీయ ఏక్తా దివాస్




**వరంగల్ వాయిస్ మల్హార్/భూపాలపల్లి:** సర్దార్ వల్లభాయ్ పటేల్ స్పూర్తితో దేశ సమగ్రతను కాపాడుతూ భిన్నత్వంలో ఐక్యతకు ప్రతీకగా నిలవడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమానికి ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను కాపాడటానికి రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం మంచి సందేశాన్ని ప్రజలకు చేరవేస్తుందని పేర్కొన్నారు. మన దేశంలో భిన్న మతాలు, జాతులు, భాషలు ఉన్నప్పటికీ పరస్పరం గౌరవం, సహకారంతో అన్ని వర్గాలు ఐక్యంగా జీవిస్తున్నాయని తెలిపారు. భారత యూనియన్‌లో ఉన్న అనేక సంస్థానాలు దేశంలో కలిసేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన పాత్ర ఎంతో గొప్పదని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహానుభావుల త్యాగాల వల్ల ఏర్పడ్డ ప్రజాస్వామ్య భారత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు ఎస్పీ నరేష్, డీఎస్పీ సంపత్ రావు, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రఘు, పోలీసు అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎకరానికి రూ.30 వేలు ఇవ్వాలి

### ◆ తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల సంభవించిన 'మొంథా' భారీ తుఫాన్ కారణంగా లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని వెంటనే ఆదుకోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తుఫాన్ సృష్టించిన బీభత్సంతో ఇండ్లు నేలమట్టమై, రోడ్లు దెబ్బతిని, వివిధ ప్రభుత్వ శాఖలకు వేలాది కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వస్వం కోల్పోయిన పేదల బ్రతుకులు అగమ్య గోచరంగా తయారయ్యాయని అన్నారు. వెంకట్రాములు ప్రభుత్వాన్ని ముఖ్యంగా ఈ క్రింది డిమాండ్లతో ముందుకు వచ్చారు. లక్షలాది ఎకరాలలో పంట నష్టం జరిగి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న రైతులకు ఎకరానికి రూ.30,000 ఆర్థిక సహాయం అందించాలి. తడిసిన ధాన్యాన్ని మొత్తంగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఇండ్లు కోల్పోయిన పేదలకు వెంటనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి. వరదల్లో చిక్కుకుని ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ. 25 లక్షలు ఎక్స్ గ్రేషియో చెల్లించాలి. ఇండ్లు కోల్పోయిన వారికి తాత్కాలిక సహాయంగా రూ. 20 వేలు, 50 కిలోల బియ్యం, బెడ్ షీట్లు, దుప్పట్లు, బట్టలు ఇవ్వాలి. తుఫాన్‌లో చనిపోయిన ఆవులు, గేదెలు, ఎడ్లు, మేకలు, గొర్రెల యజమానులకు తగిన విధంగా నష్టపరిహారం చెల్లించాలి. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన తుఫాన్, భారీ వర్షాలు, వరదల వలన జరిగిన అన్ని రకాల నష్టాల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి, నష్టపోయిన, ఇబ్బందుల పాలైన వారిని అన్ని విధాలా ఆదుకునేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

# విద్యార్థికి అభినందన వెల్లువ



**వరంగల్ వాయిస్, దామెర:** హనుమకొండ జిల్లా దామెర మండల పరిధిలోని తక్కళ్లపహాడ్ గ్రామానికి చెందిన విద్యార్థి దాడి విక్రమ్ ఇటీవల వెలువడిన ఎంబీబీఎస్ ప్రవేశ ఫలితాల్లో అద్భుత విజయాన్ని సాధించాడు. విక్రమ్, హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మకమైన నోవా కాలేజీలో కన్వీనర్ కోటా కింద మెడిసిన్ సీటు దక్కించుకోవడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.ఈ సందర్భంగా శుక్రవారం మాజీ సర్పంచ్ బింగి రాజేందర్ గారి ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మన్నెం ప్రకాష్ రెడ్డి, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ గుడిపాటి శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సిబ్బందిగా పనిచేస్తూనే, తమ కుమారుడిని ఎంబీబీఎస్ లాంటి ఉన్నత చదువుకు ప్రోత్సహించి, ఈ ఘనత సాధించేందుకు కృషి చేసిన తల్లిదండ్రులు దాడి కుమారస్వామి –అరుణ దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థి విక్రమ్ మరింత కష్టపడి చదివి, తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ముఖ్య అతిథులు సూచించారు. కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చని విక్రమ్ నిరూపించారని వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కొత్తపెల్లి భిక్షపతి, గోగ్గురా రాజకుమార్, ఎలుగోయ ఇంద్రయ్య, దాడి విజేందర్, దాడి మహేందర్, పైండ్ల భిక్షపతి, మామిడిశెట్టి శ్రీనివాస్, సారా మనేష్, బొడ్డు రాజయ్య, బొడ్డు కుమారస్వామి, గోగ్గురా మనోహర్, దాడి భిక్షపతి, తదితరులు పాల్గొని విక్రమ్‌ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఇందిరా గాంధీ సేవలు మరువలేనివి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** భారత మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం వరంగల్‌లోని కాశిబుగ్గ ప్రాంతంలో ఘనంగా నివాళులర్పించారు.కాశిబుగ్గ కూడలిలో ఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి మంత్రి శ్రీమతి కొండా సురేఖ తో కలిసి వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఇందిరా గాంధీ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా శామంతుల మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశ సమగ్రత కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. దేశానికి, పేద వర్గాలకు ఆమె చేసిన సేవలు, 20 సూత్రాల కార్యక్రమం వంటి సంస్కరణలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఆమె ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని వారు పిలుపునిచ్చారు.

# ఘనంగా పెద్ది ఆంజనేయులు పదవీ విరమణ



**వరంగల్ వాయిస్, పరకాల:** మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా సుదీర్ఘకాలం పాటు సేవలందించిన పెద్ది ఆంజనేయులు పదవీ విరమణ పొందిన సందర్భంగా ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఉద్యోగ విరమణ అభినందన సన్మాన సభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆంజనేయులుని శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంజనేయులు ప్రభుత్వ సేవలో ఉన్నంత కాలం ప్రజలకు, అభివృద్ధి కార్యక్రమాలకు అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. ఆయన నిజాయితీ, నిబద్ధతతో పనిచేసి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని ఆంజనేయులుకి శుభాకాంక్షలు తెలిపారు.

# మొంథా తుఫాన్ బీభత్సం

◆ తొర్రూరు రైతులకు గుండెకోత

◆ ఎకరానికి రూ.25 వేలు ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** బుధవారం తొర్రూరు మండలంలో కురిసిన భారీ వర్షాలు, 'మొంథా' తుఫాన్ కారణంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని అనేక గ్రామాల్లో, ముఖ్యంగా పెద్ద మంగ్యా తండా పరిధిలో, రైతులు ఆరుగాలం పండించిన పంట నీటిపాలవడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మండలంలో చాలా గ్రామాల్లో పంట పొలాలు పూర్తిగా నేలకొరిగి తీవ్ర నష్టం వాటిల్లింది. పత్తి చేలు వేసిన రైతులు, మొక్కజొన్న చేలు వేసిన రైతులు పూర్తిగా నష్టపోవడంతో అన్నదాతలకు గుండె కోతే మిగిలింది. రైతుల కళ్లముందే వారి కష్టం వృథా కావడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని తొర్రూరు మాజీ జడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారులతో సమగ్ర సర్వే నిర్వహించి, నష్టాన్ని పారదర్శకంగా గుర్తించాలని కోరారు. పూర్తిగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25,000 వెంటనే అందించాలి. పాక్షికంగా నష్టపోయిన రైతులకు: ఎకరాకు రూ. 10,000 తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలు నాయక్, దీకొండ బాలకృష్ణ, గుగులోత్ రమేష్, జాటోత్ టీకు, జాటోత్ రమేష్, జాటోత్ రాజారాం, మాజీ ఎంపీటీసీ ధర్మారపు కిరణ్, తొర్రూరు బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు యర్రం రాజు, మాలోత్ సంతోష్, అనిల్ గుప్తా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక దీపం పరమేశ్వర స్వరూపం

### తెన్నేటి వసుంధర ప్రవచనం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హిందువులకు అత్యంత పవిత్రమైన కార్తీక మాస మహోత్సవాలు హనుమకొండలోని భువనేశ్వరి మాత దేవాలయం ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ హనుమకొండ విభాగం ఆధ్వర్యంలో 'మన గుడి' కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా, ప్రముఖ సాహితీవేత్త, సంస్కృత ఉపన్యాసకులు తెన్నేటి వసుంధర కార్తీక మాసంలో దీప, స్నాన, జప, పురాణ పఠనముల విశిష్టత గురించి భక్తులకు ప్రవచనం చేశారు. వసుంధర దీపం ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను వివరిస్తూ "దీపం యదార్థంగా పరమేశ్వర స్వరూపమని" అన్నారు. మానవ జీవితంలో 'ఊపిరి' పాత్ర గురించి చెబుతూ "మన శరీరాన్ని ఎంతకాలం నిలబడాలో అంతకాలం ఊపిరిని చిత్రంగా, గుప్తంగా నిలబెట్టి, ఆ ఊపిరి అయిపోగానే బయటకు వెళ్లి శివాన్ని శవం చేసి పడగొట్టగలిగిన స్వరూపమే అది" అని వివరించారు. ఆమె భక్తులకు నిశ్చలమైన, నిర్మలమైన మనసుతో భగవంతుడిని ఆరాధించాలని సూచించారు.ఈ కార్తీక మాస మహోత్సవాల ప్రారంభోత్సవంలో టీటీడీ ప్రతినిధి రామ్ రెడ్డి కృష్ణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ మోత్కూరి రామేశ్వరరావు, భద్రకాళి దేవస్థానం బోర్డు సభ్యులు మోతుకూరి మయూరి, వరసిద్ధి వినాయక కమిటీ చైర్మన్ చాగర్ల శ్రీనివాస్, సమన్వయకర్త గుండవరం విధుమౌళి పాల్గొన్నారు. అలాగే, ఆలయ ధర్మకర్తలు అద్దంకి సారంగా చారి, పడాల సారంగపాణి, గట్టు సత్యనారాయణ, పద్మజ, జంగిలి సుధాకర్ రావు, నామా రాజేందర్, నరసింహారెడ్డి, వెంకటాచార్య సహా అనేకమంది కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు.

## కొయ్యూరు పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్



**వరంగల్ వాయిస్ మల్హర్:** సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కొయ్యూరు పోలీసుల ఆధ్వర్యంలో 2కేరన్ నిర్వహించారు. ఈ సందర్భంగా 2కే రన్ లో మొదటి బహుమతి పీసీ బలరాం, రెండవ బహుమతి పీసీ నగేష్, మూడవ బహుమతి హెడ్ కానిస్టేబుల్ మహేందర్, నాలుగవ బహుమతి సమ్మయ్య గెలుపొందగా వారికి నగదు బహుమతి అందజేశారు. కొయ్యూరు ఎస్సై నరేష్, ఎస్సై 2 రాజన్ కుమార్, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండలంలోని అక్కంపేట గ్రామంలో ఇటీవల మృతిచెందిన కొనకటి చందర్ రావు, సామల లక్ష్మి కుటుంబాలను శుక్రవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వారి మృతికిగల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాష్ట్రీయ ఏక్తా దివస్



**వరంగల్ వాయిస్, మామునూరు:** నాలుగో బెటాలియన్ ఆవరణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని 'రాష్ట్రీయ ఏక్తా దివస్' (జాతీయ సమైక్యతా దినోత్సవం)ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కమాండెంట్ పి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగాఅసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పటేల్ గొప్ప సేవలను జీవిత విశేషాలను తెలియజేశారు. 1875 అక్టోబర్ 31న గుజరాత్‌లోని నాడియార్‌లో జవేరీభాయ్, లాడ్‌బాయి దంపతులకు జన్మించారు. భారతదేశపు 'ఉక్కు మనిషి'గా పేరుగాంచారు. ప్రముఖ స్వాతంత్ర్య యోధుడిగా పోరాడారు. బార్డోలి సత్యాగ్రహానికి నాయకత్వం వహించి విజయం సాధించడం ద్వారా దేశ ప్రజల దృష్టిని ఆకర్షించారు. భారత రాజ్యాంగ రచనలో కీలక పాత్ర పోషించారు. అత్యంత ముఖ్యమైన ప్రాథమిక హక్కుల కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించారు. స్వాతంత్ర్యం తరువాత భారతదేశంలోని సుమారు 565 సంస్థానాలను విలీనం చేయడంలో గట్టి కృషి చేసి, విజయం సాధించారు. మరణించిన నాలుగు దశాబ్దాల తరువాత, 1991లో భారత ప్రభుత్వం ఆయనను 'భారత రత్న' బిరుదుతో గౌరవించింది. చివరగా, అసిస్టెంట్ కమాండెంట్ బెటాలియన్ అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరితో 'రాష్ట్రీయ ఏక్తా దివాస్ ప్రతిజ్ఞ'ను చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు విజయ్, కార్తీక్, రవి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, కృష్ణ, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, బెటాలియన్ సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్ పాల్గొన్నారు.

## కాకతీయుల శిల్ప సంపద అద్భుతం

### చారిత్రక నిర్మాణాలను భావితరాలకు అందించాలి

### ప్రిన్సిపల్ జిల్లా జడ్జ్ చిట్టూరి రమేష్ బాబు

### కార్తీక శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం:** కాకతీయుల శిల్ప సంపద ఎంతో అద్భుతమని, ఈ చారిత్రక నిర్మాణాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని భూపాలపల్లి ప్రిన్సిపల్ జిల్లా జడ్జి చిట్టూరి రమేష్ బాబు అన్నారు. కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం, శ్రీ రమేష్ బాబు గారు స్వామివారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు గారు ఆయనను సాదరంగా ఆహ్వానించి, పూజా కార్యక్రమాలు జరిపించారు. గణపతి, నందీశ్వరుడి పూజల అనంతరం ఆయన స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు మరియు పూలమాలలు సమర్పించారు. పూజల అనంతరం కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ రమేష్ బాబు గారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గణపురం ఎస్ఐ రేఖ అశోక్ ఉన్నారు.

## ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** భారతదేశంలోనే అతి పురాతనమైన కార్మిక సంఘం ఏఐటీయూసీ 106వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం హనుమకొండ జిల్లాలో ఘనంగా జరిగాయి.బాలసముద్రం, ఏకశిలా పార్కు సమీపంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో, హనుమకొండ జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షులు వేల్పుల సారంగపాణి యాదవ్ జెండాను ఆవిష్కరించి, అధ్యక్షత వహించి మాట్లాడారు. ఏఐటీయూసీ 1920లో స్థాపించబడి, భారత కార్మిక వర్గ చరిత్రలో అపూర్వమైన పాత్ర పోషించిందని తెలిపారు.ఇది కార్మికుల హక్కుల సాధన, ఉద్యోగ భద్రత, కనీస వేతనం, సామాజిక భద్రత కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజాస్వామ్య కార్మిక సంఘం అని స్పష్టం చేశారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని, కార్మిక చట్టాలను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని ఎదుర్కొనేందుకు అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సారంగపాణి యాదవ్ రాబోయే కాలంలో ఈ క్రింది ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మిక వ్యతిరేక చట్టాలను తక్షణం రద్దు చేయాలి. కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 కు పెంచాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ చేర్చి ప్రత్యక్ష కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి. పెన్షన్ హక్కులను పునరుద్ధరించాలి. నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలి. అన్ని రంగాల ఉద్యోగులకు, కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి. హనుమకొండ జిల్లాలోని ప్రతి మండలంలో, ప్రతి రంగంలో ఏఐటీయూసీ 106వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించి కార్మిక ఐక్యతను మరింత బలపరచాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ నాయకులు మద్దేల ఎల్లేష్, నద్దూనూరి వేంకట్రాజ్యం, ఎన్.ఎ.స్టాలిన్, కొట్టేపాక రవి, హనుమకొండ జిల్లా ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మముల రాంమూర్తి, మాలోత్ శంకర్ నాయక్, మద్దేల శ్రీనివాస్, లలిత, మండల సమితి ప్రతినిధులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్
సినిమా
శుక్రవారం 31 అక్టోబర్ 2025
7

# వేడుకగా నారా రోహిత్ వివాహం



## హాజరైన నారా చంద్రబాబు దంపతులు

టాలీవుడ్ యంగ్ హీరో నారా రోహిత్ ఓ ఇంటి వాడయ్యాడు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అతిరథ మహారాధుల సమక్షంలో ప్రేయసి శిరీష మేడలో మూడు ముళ్ళు వేసాడు నారా రోహిత్. గతేడాది అక్టోబర్ లో నారా రోహిత్` శిరీష్ ల నిశ్చితార్థం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత ఇప్పుడు పెళ్లి బంధంతో ఒక్కటి అయ్యారు. శిరీషా స్వస్థలం పల్నాడు జిల్లా రెంటచింతల. ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యని అభ్యసించిన శిరీష నటన పై మక్కువతో టాలీవుడ్ లో అడుగుపెట్టింది. నారా రోహిత్ ప్రధాన పాత్రలో నటించిన ప్రతినిధి`2 సినిమాలో రోహిత్ ప్రియురాలిగా నటించింది. అదే సమయంలో వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. అదే విషయాన్ని ఇంటి సభ్యులకు చెప్పారు. వారి అంగీకారంతో ఇప్పుడు వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. కాగా ఈ వేడుకకు అటు రాజకీయ, సినీ ప్రముఖులు హాజర్యయారు. రోహిత్ వివాహ వేడుకకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు  ఆయన సతీమణి భువనేశ్వరి దగ్గరుండి అన్ని కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే నారాలోకేష్ దంపతులు, నందమూరి బాలకృష్ణ దంపతులు నూతన జంటను ఆశీర్వదించారు. యంగ్ హీరోలు మంచు మనోజ్, బెల్లంకొండ శ్రీనివాస, శ్రీ విష్ణు ఈ వేడుకకు హాజరయి రోహిత్ దంపతులకు విషెష్ తెలిపారు. వీరితో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ వేడకలో పాల్గోని వధూవరులను దీవించారు.






## అఖండ-2 కోసం థమన్ మాస్ థీమ్

నందమూరి బాలకృష్ణ హీరోగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అఖండ 2: తాండవం' చిత్రంపై భారీ అంచనాలు అంతకంతకు పెరుగుతూ ఉన్నాయి. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, గ్లింప్స్ చిత్రంపై భారీ హైప్ క్రియేట్ చేశాయి. ఇప్పటికే థమన్ 'అఖండ' సినిమా మ్యూజిక్‌తో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసి ఇప్పుడు 'అఖండ 2' కోసం మరింత పవర్‌ఫుల్, డివైన్ టోన్ సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాటలు, సంగీతంపై దృష్టి పెట్టిన తమన్ శ్లోకాలు వల్లించడంలో ఉద్దండులైన వారిని రంగంలోకి దింపుతున్నాడు. ఇప్పటికే ఉత్తరాది నుంచి మిశ్రా బ్రదర్స్ ను తీసుకు రాగా తాజాగా సర్వేపల్లి సిస్టర్స్ ను తెర మీదకు తీసుకు వచ్చాడు. 'అఖండ 2: తాండవం' కోసం థమన్ అందిస్తున్న శక్తిమంతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను మరింత అద్భుతంగా మార్చేందుకు సర్వేపల్లి సిస్టర్స్ గాత్రాన్ని పాటల కోసం వాడుతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. బాలయ్య ఎంట్రీ సీన్స్ కోసం ప్రత్యేకమైన శివతాండవ రాగాల కలయికతో థమన్ ఒక ఆధ్యాత్మిక మాస్ థీమ్ రూపొందిస్తున్నారు. ఫ్యాన్స్ ఇప్పటికే థమన్ సోషల్ మీడియాలో షేర్ చేసిన చిన్న సౌండ్ స్నిప్ వల్ల ఎగ్జైట్ అవుతున్నారు. బోయపాటి, బాలయ్య కాంబినేషన్ మరోసారి రికార్డులు తిరగరాయ బోతుందన్న నమ్మకం అభిమానుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ చెన్నై పరిసరాల్లో జరుగుతుండగా, మ్యూజిక్ మరియు బ్యాక్‌గ్రౌండ్ వర్క్ సమాంతరంగా సాగుతోంది.

## కొత్త అనుభూతిని పంచిన బాహుబలి.. ది ఎపిక్




'బాహుబలి' సినిమాల్లో కథ అందరికీ తెలిసిందే. ఈసారి కథ కంటే కూడా మహిష్మతి ప్రపంచాన్ని మరోసారి పెద్ద తెరపై చూడటానికీ, రెండు భాగాలు కలిపి చూసినప్పుడు పాత్రలు పంచే ఆ అనుభూతి ఎలా ఉంటుందో అస్వాదించడానికీ వెళతారు ప్రేక్షకులు. అయితే కథ తెలిసినవాళ్లకయినా.. తెలియని వాళ్లకైనా సరే 'బాహుబలి : ది ఎపిక్' ఓ కొత్త సినిమా చూసిన అనుభూతిని పంచుతుంది. అందరినీ మరోసారి మాహిష్మతి ప్రపంచంలో లీనం చేసి, పాత్రలతో కలిసి ప్రయాణం చేయించారు దర్శకుడు రాజమౌళి. అలాగని ఇందులో కొత్త సన్నివేశాలేమీ జోడిరచలేదు. ఒకట్రెండు డైలాగులు తప్ప అదనంగా ఏమీ ఉండవు. రాజమౌళి తెరపై చూపించిన మాహిష్మతి రాజ్యాన్ని దాని పాలనకు సంబంధించిన రెండు పార్ట్‌లను కలిపి ఒక్కటిగా చూపారు. ఇప్పుడు ఆ రెండు భాగాల్ని కలిపి చూస్తునప్పుడు.. ఒకవైపు థ్రిల్ చేసే హీరోయిక్ హై మూమెంట్స్, మరోవైపు కథలోని భావోద్వేగాలు మనసుల్ని కట్టిపడేస్తూ ఎపిక్ అనుభవాన్ని పంచుతుంది. సినిమాని కొత్తగా ఎడిట్ చేసినా.. స్క్రీన్‌ప్లేలో మార్పులేమీ లేవు. తొలి భాగం సినిమాని ప్రథమార్థంలోనూ, రెండో సినిమాని ద్వితీయార్థంలోనూ చూపించారు. ప్రథమార్థంలో పచ్చబొట్టేసినా పాటతోపాటు, శివుడు, అవంతిక పాత్రల మధ్య లవ్ ట్రాక్‌కి కోత పెట్టారు. ఆ ఎపిసోడ్ కథనంతా రాజమౌళి తన వాయిస్ ఓవర్‌తో చెప్పేశారు. ఆ తర్వాత కీలక సన్నివేశాల్ని చూపిస్తూ కథని వేగంగా చెప్పే ప్రయత్నం కనిపిస్తుంది. ప్రథమార్థంలో యుద్ధం ఎపిసోడ్స్‌నీ కొంచెం కుదించి చూపించారు. దాంతో అవి మరింత పదునుగా అనిపిస్తాయి. కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడో తెలుసుకునేందుకు ఇప్పుడు రెండేళ్లు ఎదురు చూడాల్సిన అవసరం లేదని సూచిస్తూ తొలి భాగాన్ని ముగించారు. 'బాహుబలి: ది కన్‌క్లూజన్' కథతో ద్వితీయార్ధాన్ని భావోద్వేగ భరితంగా చూపించి ప్రేక్షకులను మరోసారి కట్టిపడేశారు. ప్రతి ఎపిసోడ్ హైలెట్‌గా నిలుస్తుంది. రెండు భాగాల్లో తొంభై నిమిషాలకుపైగా సన్నివేశాలను తొలగించినా ఆ ప్రభావం సినిమాపై పెద్దగా కనిపించనివ్వకపోవడం విశేషం. ఒక సినిమాలో అమాంతం సన్నివేశాలు మారినప్పుడు సంగీతం పరంగానూ, విజువల్ కోణంలోనూ సమస్యలొస్తుంటాయి. ఆ విషయాలపై ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుని రీవర్క్ చేసినట్టు అనిపిస్తుంది. చాలా రోజుల తర్వాత పెద్ద తెరపైన ప్రభాస్ రాయల్ లుక్‌ని చూడటం అభిమానులకైతే ఓ పండగ అనుభవమే. ప్రభాస్ ని మళ్లీ అలాంటి డైనమిక్ లుక్‌లో, అంత హుషారుగా ఎప్పుడెప్పుడు చూస్తామా అనే ఆశని, ఉత్సుకతని రేకెత్తిస్తుందీ చిత్రం. భల్లాలగా రానా దగ్గుబాటిని తప్ప మరొకరిని ఊహించుకోలేం అన్నట్టుగా ఆయన అభినయం మరోసారి మైమరిపిస్తుంది. కీరవాణి సమకూర్చిన సంగీతం కొత్త హంగుల్ని అద్దుకుని మరింత కొత్తగా వినిపించింది. నేపథ్య సంగీతం మరో స్థాయిలో ఉంది. మారిన సాంకేతికతకి అనుగుణంగా సంగీతం, విజువల్స్‌కు కొత్త హంగుల్ని సంతరించుకోవడం 'ది ఎపిక్'కి మరింతగా కలిసొచ్చింది. ఎడిటింగ్ బాగా కుదిరింది. రెండు భాగాలను కలిపి ఒక సినిమాగా తీసుకొచ్చే ఓ కొత్త దారిని 'బాహుబలి: ది ఎపిక్' చూపించింది.




## కపూర్ ఫ్యామిలీపై డాక్యుమెంటరీ

బాలీవుడ్ స్టార్ కుటుంబం కపూర్ ఫ్యామిలీకి సంబంధించి నెట్‌ఫ్లిక్స్ వేదికగా డాక్యుమెంటరీ సిరీస్ రాబోతుంది. 'డైనింగ్ విత్ ది కపూర్స్' అనే పేరుతో రూపొందిన ఈ ఫ్యామిలీ డాక్యుమెంటరీ నవంబర్ 21 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ప్రకటించింది. ఈ డాక్యుమెంటరీలో కపూర్ కుటుంబానికి చెందిన అగ్ర నటులు రణ్‌బీర్ కపూర్, కరీనా కపూర్ ఖాన్ తదితర ప్రముఖులు తమ కుటుంబ అనుబంధాలు, జ్ఞాపకాలు, బాల్యం గురించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకోనున్నారు. బాలీవుడ్ లెజెండ్ రాజ్ కపూర్ వారసత్వాన్ని కొనసాగిస్తున్న ఈ కుటుంబంలోని ప్రస్తుత తరం స్టార్స్ జీవిత విశేషాలు అభిమానులకు ఆసక్తికరంగా మారనున్నాయి.

# రూ.10 కోట్ల నష్టం

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి
- రెండు రోజులు క్షేత్రస్థాయి పర్యటన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మొంథా తుఫాను ప్రభావంతో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్) పరిధిలో సుమారు రూ. 10 కోట్ల నష్టం వాటిల్లిందని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం హనుమకొండ డివిజన్ పరిధిలో నీట మునిగిన గోపాల్ పూర్, యాదవ నగర్ సబ్ స్టేషన్ లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాను నేపథ్యంలో ఎక్కడ విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. భారీ వర్షంలోనూ రేయింబవళ్లు పని చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామన్నారు. ఇప్పటివరకు నీట మునిగిన 249 ట్రాన్స్ ఫార్మర్లలో 246 సరిచేశామని, నీట మునిగిన సబ్ స్టేషన్ లు ఎనిమిది ఉండగా అందులో ఆరు సబ్ స్టేషన్ లు పునరుద్ధరించామన్నారు. మిగిలిన రెండు సబ్ స్టేషన్ లకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించామని సీఎండీ పేర్కొన్నారు. 33 కేవీ ఫీడర్లు 44 ప్రభావితం కాగా 44 పునరుద్ధరించామన్నారు. అలాగే 11 కేవీ ఫీడర్లు 116 కు 116 పునరుద్ధరించామన్నారు. 428 స్తంభాలు దెబ్బతిన్నాయని చెప్పారు. అయితే గత రెండు రోజులుగా వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా పరిస్థితులను, పునరుద్ధరణ చర్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన సీఎండీ గోపాల్ పూర్, యాదవ నగర్ సబ్ స్టేషన్ ప్రాంతాలకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించామని తెలిపారు. తరచుగా నీట మునిగే సబ్ స్టేషన్ లను మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే 100 ఫీట్ రోడ్ లోని ప్రగతి నగర్ కాలనీలో పర్యటించారు.

నేరుగా అక్కడ జరుగుతున్న విద్యుత్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షించారు. అనంతరం మచిలీ బజార్ సెక్షన్ లోని కాపువాడలో జరుగుతున్న విద్యుత్ పునరుద్ధరణ పనులను స్వయంగా పర్యవేక్షించారు. భారీ వర్షంలో సైతం మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి ప్రతి ఒక్కరూ ఆహర్నిశలు కష్టపడి పనిచేశారన్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన అందరికి సీఎండీ అభినందనలు తెలిపారు. అలాగే అందరు అప్రమతంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. సీఎండీ వెంట డైరెక్టర్ ఆపరేషన్ టి.మధుసూదన్, హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, హనుమకొండ డీఈలు సాంబ రెడ్డి, దర్శన్ కుమార్, ఏడీ ఈ.మల్లికార్జున్, ఏఈలు తదితరులు ఉన్నారు.

# ఇందిర జీవితం అందరికీ ఆదర్శం

- దేశ ఐక్యతకు ప్రాణాలర్పించిన ధీరవనిత
- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఇందిరమ్మ జీవితం భారతీయులందరికీ ఆదర్శప్రాయమని.. దేశ ఐక్యత కోసం ప్రాణాలర్పించిన ధీరవనిత అని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. శుక్రవారం భారతదేశ తొలి మహిళా ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా కాశిబుగ్గ సెంటర్ లోని ఇందిరా గాంధీ విగ్రహానికి కొండా సురేఖ పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దేశ ప్రధానిగా ఇందిరాగాంధీ అందించిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం మంత్రి సురేఖ మీడియాతో మాట్లాడుతూ.. గరీబీ హఠావో అనే నినాదంతో దేశంలోని ప్రతి పేద వాడి కడుపు నింపి.. ఆకలి తీర్చిన గొప్ప నాయకురాలు స్వర్గీయ ఇందిరా గాంధీ అని చెప్పారు. భారతదేశపు కీర్తిని ప్రపంచం నలుమూలలా చాటిచెప్పిన ఉక్కు మహిళ ఇందిరమ్మ అని స్పష్టం చేశారు. ఆ మహనీయురాలు రాజకీయ, వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని శక్తిమంతమైన నాయకురాలిగా భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే స్థాయికి ఆమె ఎదిగిన తీరు మనకి ఎంతగానో స్ఫూర్తిదాయకమన్నారు. ఈ నేపథ్యంలోనే మన రాష్ట్రంలో ఉన్న ఎన్నో కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఆమె హయాంలోనే మనకు వచ్చాయని, ఆ విధంగా ఇందిరమ్మ మన రాష్ట్ర అభివృద్ధికి ఆనాడే పాటుపడ్డారన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అనే బృహత్తరమైన కార్యక్రమం మన ప్రజా ప్రభుత్వం సమర్ధవంతంగా చేపడుతుందని అన్నారు. అయితే, ఈ ఒక్క రోజే కాకుండా రానున్న రోజుల్లోనూ ఇందిరమ్మ సేవలను పార్టీలకతీతంగా మనమంతా మననం చేసుకోవాల్సిన అనివార్యత ఎంతైనా ఉందని మంత్రి సురేఖ గుర్తు చేశారు.

# డోంట్ కేర్..



- నాయకులే డీలర్లు
- పక్కదారి పట్టిన పీడీఎస్ బియ్యం
- అధికారి సమక్షంలో ప్రత్యేక సమావేశం
- ఆరా తీస్తున్న సివిల్ సప్లై, ఇంటెలిజెన్స్ వర్గాలు
- అక్రమార్కుల భరతం పట్టాలంటున్న జనం


**వరంగల్ వాయిస్, దామెర :** ఇటీవల దామెర మండలంలో పక్కదారి పట్టిన రేషన్ బియ్యంపై ఒక అధికారి సమక్షంలో డీలర్లు ప్రత్యేక సమావేశమై చర్చించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. లారీల కొద్ది బియ్యం పక్కదారి పట్టడంపై ఇటీవల వరంగల్ వాయిస్ సాయంకాలం దిన పత్రికలో వచ్చిన కథనంపై తీవ్రంగా చర్చించినట్లు తెలిసింది. డోంట్ వర్రీ.. అన్ని తానే చూసుకుంటానంటూ సదరు అధికారి డీలర్లకు హామీ ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. అయితే బియ్యం పక్కదారి పట్టడంపై ఇప్పటికే సివిల్ సప్లై శాఖ అధికారులు, ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు స్పష్టమైన సమాచారం. దీనిలో డీలర్ల పాత్ర ఎంత ఉంది? దీని వెనకాల అధికారులు ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే రేషన్ బియ్యం దందాపై స్పష్టమైన ఆధారాలున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదరు అధికారి అక్రమాలపై గతంలోనే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే ఆ అధికారికి ఎమ్మెల్యే అండదండలు మెండుగా ఉన్నందుకే చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారన్నది గమనార్హం. దీనికితోడు కొంతమంది నాయకులు, వారి కుటుంబ సభ్యులే డీలర్లయినందున చర్యలు శూన్యమన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇదంతా అధికారులు, డీలర్ల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది. రేషన్ బియ్యం దందాపై మండల అధికారుల నిర్లక్ష్యంపై జిల్లా అధికారులు దృష్టి పెట్టడంతో ఈ మలుపు ఎంతవరకు కొనసాగుతుందో అన్న ప్రచారం సాగుతోంది. అయితే అక్రమార్కుల భరతం పట్టాల్సిన అవసరం ఉందని పలువురు భావిస్తున్నారు.

# నిద్ర మత్తులో ప్రభుత్వం

- కంటతడి పెడుతున్న అన్నదాతలు
- తుఫాను నష్టంపై ఈటల రాజేందర్ విమర్శలు



**వరంగల్ వాయిస్, దామెర :** 'మొంథా' భారీ తుఫాన్ కారణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రైతులు అపారంగా నష్టపోయారని, అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చురుగ్గా సహాయక చర్యలు చేపడుతుంటే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా విమర్శించారు. తుఫాన్ ప్రభావంతో వరంగల్ జిల్లాతో సహా రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంట అక్కరకు రాకుండా పోయిందని ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం దామెర మండలం ఊరుగొండలో రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు లక్ష్మి నర్సయ్య, మాజీ ఎంపీ సీతారాం నాయక్ లతో కలిసి ఆయన తుపాను ప్రభావంతో నీట మునిగిన వరి, పత్తి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ నష్టం వివరాలను వివరిస్తూ అధిక వర్షపాతంతో పత్తి చేలు జాలు పట్టాయని, చెట్టు మీదనే కాయలు రాలిపోయి, చేతికి రావాల్సిన పంట నీళ్లపాలయ్యిందన్నారు. కోత కోసి పెట్టిన మక్క, వరి పంటలు కొట్టుకుపోయి, మొలకలు వచ్చి, బూజు పట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. మక్క, వరి పంటలు కూడా ఎదగలేదని పేర్కొన్నారు. గత వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు ఇప్పటికీ బాగు కాలేదని, ఈ తుఫాన్ మరింత విధ్వంసం సృష్టించిందన్నారు. 'వరంగల్ రైతులు ఏడుస్తున్నారు.. గ్రామాల్లో విషాదం నెలకొంది.. మండలంలో వర్షం పడింది అంటే అది ఎంత విధ్వంసం సృష్టించిందో అర్థం చేసుకోవచ్చు' అని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఆ ప్రభుత్వ యంత్రాంగం ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపడుతున్నారని, రైతులతో మాట్లాడి ధైర్యం చెప్తున్నారని ఈటల ప్రశంసించారు. కానీ తెలంగాణలో మాత్రం ప్రభుత్వం నిష్క్రియంగా ఉందని విమర్శించారు. వరదల్లో కార్లు కొట్టుకుపోవడం, మనుషులు కొట్టుకుపోవడం వంటి భయానక వాతావరణం నెలకొందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పంట, ఇళ్ల నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలన్నారు. వెంటనే రైతులను, బాధితులను కలిసి ఓదార్చాలని, నష్టపోయిన ప్రతి రైతుకు, ఇండ్లు, ఇంట్లో సామాను కోల్పోయిన వారికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గురజాల శ్రీరామ్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పొడాల మధుకర్, దామెర మండల ప్రధాన కార్యదర్శులు గండు ముఖేష్, సూర చందర్, గోగుల సమ్మిరెడ్డి, గండు పరశురాం, గడ్డం కార్తీక్, రైతులు చెల్పూర్ చంద్రయ్య, చెల్పూర్ వైకుంఠ, ఓదెల దేవేందర్, ఉప్పుల సారయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# బీబీఎంలో షార్ట్ సర్క్యూట్

- వరదల ప్రభావమే అంటున్న స్థానికులు

**వరంగల్ వాయిస్, రామన్నపేట :** హంటర్ రోడ్ బైపాస్ రోడ్డులో గురువారం రాత్రి బీబీఎం ఎలక్ట్రికల్ వెహికిల్ విక్రయ శాలలో మంటలు లేచాయి. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో హంటర్ రోడ్డులోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అందులో భాగంగానే బీబీఎం విక్రయ శాల సైతం నీటిలో మునిగింది. భారీ ఎత్తున వచ్చిన వరద తాకిడికి షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగినట్లు స్థానికులు చెప్పుకొంటున్నారు. విషయం తెలియగానే బీబీఎం విక్రయ శాల యజమాని శ్రీరాముల సురేష్ హుటాహుటిన అక్కడికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి షట్టర్ తీసి మంటలు ఆర్పి వేశారు. అయితే అప్పటికే రెండు 100 కిలోమీటర్ల సామర్థ్యం కలిగిన బండ్లు పూర్తిగా కాలిపోయాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com